

కరాటేలో శిక్షణ ఇస్తా

మహిళలు, బాలికలకు కరాటేపై ప్రత్యేక శిక్షణ ఇస్తానని ప్రముఖ సినీ నటుడు సుమన్ తెలిపారు. - 10లో



కొత్త ఆవిష్కరణలు చేయాలి

విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేసే దిశగా ఎదగాలని సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
36°/17°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

• ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్పీ అపూర్వరావు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఫిబ్రవరి నెలలో జిల్లా వ్యాప్తంగా మద్యం తాగి 1,188మంది పట్టుబడినట్లు తెలిపారు. వారిలో 453మందిని కోర్టులో హాజరుపరచగా 21మందికి వారం రోజుల చొప్పున జైలు శిక్ష పడినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతరం జిల్లా వ్యాప్తంగా వాహనాలు తనిఖీ చేస్తామని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారున్ని నిలపకుండానే ట్యాబ్ ద్వారా జరిమానా విధిస్తామని తెలిపారు.

'మన ఊరు మనబడి' పనుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ కాంతమ్మ

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలం ఇండ్లూరు ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ కాంతమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు మనబడి పనులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.విజయలక్ష్మి, ఏఈ గౌస్, ఎస్ఎంసీ చైర్మన్ బత్తుల యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు వీరాచారి, ఉపాధ్యాయులు కిరణ్మయి, లింగమల్లు, శోభారాణి, విక్రమ్, నయీమున్నీసా, సుచరిత పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటకండ్ల దామోదర్ రెడ్డి అన్నారు. మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్ భవన్‌లో నూతనంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన దామోదర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కింద అన్ని ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, జెల్లా పుల్లయ్య, గోవిందు సుధాకర్, శేషారెడ్డి, గోపాల్‌రెడ్డి, కేశవాచారి, రమేష్, రఘునాథం, బాలరాజు, ఆజామలీ, మోహన్‌రావు, రంగయ్య, ఆంజనేయులు, అనసూయమ్మ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలో బుధవారం నుంచి ప్రారంభమవుతున్న గిరిజన సంఘం మహాసభలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మంగళవారం బహిరంగ సభ స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మార్చి 1న మహా ప్రదర్శన, బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక హనుమాన్ ప్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ఎన్ఎస్పీ క్యాంపు మైదానం వరకు మహా ప్రదర్శన జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2గంటలకు ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు రవినాయక్, బాబునాయక్, నాగేశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల ఆక్రమణ!

ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులే సూత్రధారులు

- ఇప్పటికే వంద ఎకరాల వరకు అన్యాక్రాంతం
- దామరచర్ల మండలంలో కబ్జారాయుళ్ల దందా
- మొక్కలు నాటిన భూములనూ మింగే ప్రయత్నం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



అటవీ భూములను ఆక్రమించుకునేందుకు మొక్కలను తొలగించిన దృశ్యాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అటవీ భూముల పరిరక్షణకు తోడ్పడాల్సిన వారే ఆక్రమణకు తెరలేపారు. ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులే సూత్రధారులుగా కబ్జాలు కొనసాగుతున్నాయి. పర్యవేక్షణ లోపం, అధికారుల ఉదాసీనతతో దామరచర్ల మండలంలో యథేచ్ఛగా అటవీ భూముల ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే వంద ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేసిన ఆక్రమణదారులు చివరకు అటవీ శాఖ మొక్కలు నాటిన భూమిని కూడా వదలడం లేదు. దానిని ఆక్రమించుకునేందుకు మొక్కలను తొలగించి చదును చేసే పనిలో పడ్డారు. వందల ఎకరాల అటవీ భూమి అన్యాక్రాంతం అవుతున్నా అటు అటవీశాఖ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇప్పటికే అధిక మొత్తంలో ఆక్రమణ

దామరచర్ల మండలంలోని వజీరాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ పరిధిలో మొత్తం 855.69 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ భూమి ఉండగా అందులో వంద ఎకరాలు ఓ సిమెంటు పరిశ్రమకు కేటాయించగా, మరో 119.38 ఎకరాలను డీఫారెస్ట్రేషన్ చేసి సాగర్ ముంపు ప్రాంతాలకు చెందిన వారికి కేటాయించారు. అప్పట్లో అక్కడ ఉపాధి లేకపోవడంతో వారు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కొందరు స్థానికంగానే ఉన్నా వారిని బెదిరించి భూములను ఆక్రమించుకున్నారు. మిగతా భూమిలో అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటారు. ఇప్పుడు ఆ భూమిని కబ్జా చేసేందుకు కొందరు సిద్ధమయ్యారు.

మొక్కలను నాటిన ఫారెస్ట్ అధికారులు

అటవీ శాఖకు చెందిన 1వ క్యాంపు పరిధిలోని 7.5 హెక్టార్ల భూమిలో అధికారులు 2021 అక్టోబరు 21వ తేదీన మొక్కలు నాటారు. ఆ మొక్కలు ఇప్పుడు ఆరేడు అడుగుల వరకు పెరిగాయి. అయితే ఆ భూమిపై మండల కేంద్రానికి చెందిన పలువురు అధికార పార్టీ నాయకులు కన్ను పడింది. ఆ భూములను కాజేసేందుకు ప్రణాళికలు రచించారు. తప్పుడు పత్రాలను సృష్టించి పోడు భూముల కింద నమోదు చేసుకునేందుకు ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా ఫారెస్ట్ అధికారులు నాటిన 480 మొక్కలను రెండు రోజుల కిందట రాత్రికి రాత్రే తొలగించేసి కబ్జాల పర్వానికి తెర తీశారు.

పట్టింపేదీ?

ఈ కబ్జా బాగోతంపై ఫారెస్ట్ అధికారులు వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా స్థానిక పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పైగా ఓ పోలీసైతే 'మీ ఫిర్యాదులో పేర్కొన్న వారే మొక్కలను తొలగించారని మీరు కచ్చితంగా చెప్పగలరా?' అని అటవీ శాఖ సిబ్బందినే ఎదురు ప్రశ్నించడం గమనార్హం. మొక్కలను తొలగించిన వారిని తాము చూశామని చెప్పినా పట్టించుకోవడం లేదని అటవీశాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. దీనిని బట్టి స్థానిక పోలీసుల అండదండలు కూడా కబ్జాదారులకు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ శాఖ అధికారులు ఫిర్యాదు చేసినా రాజకీయ ఒత్తిళ్లతోనే కేసు నమోదు చేయకుండా తొక్కిపెడుతున్నట్లు తెలిసింది.

ఫిర్యాదు చేశాం

వజీరాబాద్ 1వ క్యాంపు పరిధిలోని ఏడున్నర హెక్టార్లలో మొక్కలను నాటింది వాస్తవమే. ప్రస్తుతం కొందరు వాటిని పీకేశారు. ఈ విషయంపై వాడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాం. భూముల కబ్జాను ఆపేందుకు అక్కడి సిబ్బందితో పర్యవేక్షిస్తున్నాం.

–ఆనంద్‌రెడ్డి, ఎఫ్ఆర్‌వో, మిర్యాలగూడ

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం

అటవీ, ప్రభుత్వ భూములను కబ్జా చేసినట్లు ఫిర్యాదులు అందితే తప్పకుండా కేసులను నమోదు చేస్తాం. ఫారెస్ట్ భూములను ఆక్రమించినట్లు ఫిర్యాదు అందింది. దానిపై విచారించి తగు చర్యలు తీసుకుంటాం.

– మామిడి రవికుమార్, వాడపల్లి ఎస్‌ఐ

నేడు మిర్యాలగూడ మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో మార్చి 1వ తేది (బుధవారం) 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 98499 05914



రవీందర్‌సాగర్ మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

• కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

నల్లగొండ: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ జోన్ పరిధిలో నాగార్జునసాగర్ వన్యప్రాణి డివిజన్ చుట్టూ ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు నోటిఫై చేసేందుకు కేంద్ర వన్య ప్రాణుల సంరక్షణ బోర్డ్‌కు ప్రతిపాదనలు పంపించనున్నట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడించారు. అటవీ శాఖ, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో ఎకో సెన్సిటివ్ జోన్ ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఎఫ్ఓ రాంబాబు మాట్లాడుతూ జాతీయ వన్య ప్రాణుల బోర్డ్ 2002వ సతంవత్సరం జనవరి 21న నిర్వహించిన సమావేశంలో వన్య ప్రాణుల సంరక్షణ వ్యూహం 2002 రూపొందించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టం1986 సెక్షన్ 3, పర్యావరణ రక్షణ నిబంధనలు రూల్ 5ననుసరించి జాతీయ పార్కులు, వన్య ప్రాణుల అభయారణ్యాల పరిధిలోని 10 కి.మీ పరిధిలో వచ్చే భూ భాగం ఎకో సెన్సిటివ్ జోన్‌గా నోటిఫై చేయాలని పేర్కొన్నట్లు తెలిపారు. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2012 మార్చి 13న జాతీయ పార్కులు, అభయారణ్యాల చుట్టూ వన్య ప్రాణుల రక్షణ, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ వైల్డ్ లైఫ్ డివిజన్ కింద 10 కి.మీ పరిధిలో ఏ కార్యకలాపాలు చేయవచ్చు, నిషేధం, నియంత్రణపై కమిటీ చర్చించి ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఎఫ్ఓ రాంబాబు, పరిశ్రమల శాఖ జీఎం కోటేశ్వరరావు, జేడీ సుచరిత, గనుల శాఖ ఏడీ వెంకటేశ్వర్ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీవల్లి టౌన్‌షిప్‌కు మార్చి 16 నుంచి వేలం

నార్కట్ పల్లి మండలం ఎల్లారెడ్డిగూడ గ్రామ పరిధి ఎం.జీ.యూనివర్సిటీ ఎదురుగా ఉన్న రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాలకు మార్చి 16,17,18 తేదీల్లో 4వ విడత భౌతిక వేలం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మొదటి బిడ్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. శ్రీ వల్లి టౌన్ షిప్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.2.70 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. నాలుగో విడత నిర్వహించనున్న వేలంలో 253 పాక్షిక గృహాలు, 133 ఓపెన్ ప్లాట్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ ప్లాట్లకు గజం రూ.6000లు, పాక్షిక గృహాలకు నిర్మాణ దశను బట్టి రూ.6000ల నుంచి రూ.10,500ల కనిష్ఠ ధర నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, భాస్కర్ రావులు, గృహ నిర్మాణ పీడీ రాజ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి



సైన్స్ ప్రయోగ చిత్రాలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణారావు సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన చిత్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మానవ మనగడకు కావల్సిన అంశాలపై పరిశోధనలు చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు వేసిన చిత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ , అధ్యాపకులు రవి, రమేష్, భిక్షమయ్య, రమేష్, రమచందర్‌గౌడ్ పాల్గొన్నారు.

దేశాన్ని దోచుకుంటున్న అగ్రకులాలు

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

బీబీనగర్: వివిధ రంగాల్లో దేశ సంపదను దోచుకొని విదేశాలకు పారిపోతున్న వారంతా అగ్రకులాల దొరలేనని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఆరోపించారు. మంగళవారం బీబీనగర్ మండలంలోని బీబీనగర్, రహీమఖాన్‌గూడెం, గూడూరు, రాఘవాపురం, రుద్రవెల్లి గ్రామాల్లో ఆయన పాదయాత్ర కొనసాగింది. ఈసందర్భంగా పార్టీ జెండాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్య స్థాపనకై పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యం వస్తే ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్, లక్ష్మణ్, నరేందర్, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు' ఫలితాలు సంతృప్తికరం: డీఈఓ



నల్లగొండ : సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

నల్లగొండ : తొలిమెట్టు కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని, ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని డీఈఓ భిక్షపతి అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక డైట్ కళాశాలలో అన్ని మండలాల విద్యాధికారులు, తొలిమెట్టు నోడల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ప్రతి మండల విద్యాధికారి, ఎఫ్ ఎల్ ఎన్ మండల నోడల్ ఆఫీసర్, క్లస్టర్ నోడల్ ఆఫీసర్, జిల్లాస్థాయి బృందాలు వారికి కేటాయించిన మండలాల్లోని పాఠశాలలను విధిగా సందర్శించాలన్నారు. బోధన తీరును పరిశీలించి మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేయాలని సూచించారు. ఆగస్టు 2022లో నిర్వహించిన ప్రారంభ పరీక్ష ఫలితాలను జనవరి 2023 ఫలితాలతో పోల్చినప్పుడు మంచి ప్రగతి ఉందని తెలిపారు. పదో తరగతి ప్రత్యేక తరగతులను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. సాయంత్రం మెనూలో సూచించిన విధంగా అల్పాహారం అందించాలన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు రామచంద్రయ్య, వీరయ్య పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి




కట్టంగూర్: విద్యార్థులతో మాట్లాడుతున్న భిక్షపతి

కట్టంగూర్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. భౌతిక శాస్త్రవేత్త సీవీరామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. విద్యార్థులు ప్రతి అంశంపై సమగ్ర అవగాహనతో ముందుకెళ్లాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులు ప్రశాంతతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు జెల్ల ముత్తిలింగం, మండల విద్యాధికారి మేక నాగయ్య, సర్పంచ్ చెనగోని సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్ జ్యోతి, ఉపాధ్యాయులు బాలరాజు, రాజేందర్, గఫూర్, శ్రీనివాస్, పద్మావతి, సునంద, సుజాత, సునిత, నీరజ, సంపత్‌కుమార్, అనిత, లక్ష్మి, సీఆర్‌పీ పోలగోని రవికుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కల్యాణ వైభోగమే..

- కనులపండువగా యాదాద్రి లక్ష్మీనరసింహుడి వివాహ మహోత్సవం
- ఉద్ఘాటన తర్వాత ప్రధానాలయంలో తొలిసారి వేడుక
- గజవాహనంపై కల్యాణ నారసింహుడిగా మాఢ వీధుల్లో ఊరేగింపు



కల్యాణ తంతు నిర్వహిస్తున్న ఆచార్యులు



స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న సీఎం కేసీఆర్ సతీమణి శోభ, తదితరులు

యాదాద్రి ప్రధానాలయంలో మంగళవారం రాత్రి జరిగిన స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట: జయజయ నారసింహ నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. దేదీప్యమానమైన విద్యుద్దీపకాంతుల వెలుగులో.. వేద పండితుల వేదోక్త మంత్ర పఠనములు.. ఆస్థాన విద్వాంసుల మంగళకరమైన వాయిద్యాల నడుమ శ్రీనృసింహుడు దేవేరి శ్రీమహాలక్ష్మిల పరిణయ వేడుక వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి 8.15 గంటలకు గజవాహనంపై వజ్రవైఢుర్యాలు, బంగారు ఆభరణాలు ధరించి శ్రీస్వామి వారు, నవ వధువుగా శ్రీలక్ష్మీదేవి దివ్యాలంకార శోభితమై ప్రత్యేక పల్లకి సేవలో శ్రీస్వామి వారిని అనుసరించగా ఆలయ మాఢ వీధుల్లో ఊరేగింపు సేవ సాగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున తీసుకువచ్చిన పట్టు వస్త్రాలతో అలంకార సేవలో ప్రజాప్రతినిధులు, ఆలయాధికారులు, భక్తులు నడిచారు.

మంగళం నారసింహాయ అంటూ..

పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ ఆచార్యులు రాత్రి 8.46 గంటలకు ఆలయ తూర్పు మాఢ వీధిలోని బ్రహ్మోత్సవ మండపంలో 'మంగళం నారసింహాయ మంగళం.. మంగళం గుణసింధవే.. మంగళానాం నివాసాయ యాదాద్రీశాయ మంగళం..' అంటూ తిరు కల్యాణోత్సవానికి శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. తొలుత బ్రహ్మోత్సవ మండపంలో ఆసీనులైన శ్రీస్వామి అమ్మవార్లకు ఆచార్యులు విష్వక్సేన ఆరాధన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, సంప్రోక్షణ వేడుకను జరిపించారు. వేద మంత్రాలతో శ్రీస్వామి వారికి ఆలయ ప్రధానార్చకులు కంకణధారణ చేశారు. ఆచార్యులు, వేద పండితులు, పారాయణీకులు వేద మంత్రాలు పఠిస్తుండగా ఆలయ ప్రధానార్చకులు శ్రీస్వామి వారికి యజ్ఞోపవీతం చేశారు. ఆ వెంటనే సకల దేవలత ఆశీస్సులతో వేద మంత్ర పఠనంతో శ్రీవారు అమ్మవారికి, అమ్మవారు శ్రీవారికి జీలకర్ర బెల్లం పెట్టిన తంతు ఆచార్యులు కనులపండువగా జరిపించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలను చేపట్టిన అర్చకస్వాములు మాంగళ్యధారణకు రంగం సిద్ధం చేశారు. బ్రాహ్మణోత్తముల వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, సన్నాయి మేళాలు మోగుతుండగా తుల లగ్నంలో లోకనాయకుడు శ్రీనృసింహుడు దేవేరీ శ్రీలక్ష్మీదేవి అమ్మవారి మెడలో మాంగళ్యధారణ గావించారు. తరువాత శ్రీస్వామి అమ్మవార్లకు ఆచార్యులు ముత్యాల తలంబ్రాల వేడుక నిర్వహించారు.

యాదాద్రీశుడి కల్యాణ వేడుక జరిగింది ఇలా..

- రాత్రి 8.18గంటలకు శ్రీస్వామి వారు గజవాహనంపై, అమ్మవారు ప్రత్యేక పల్లకిపై మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.
- 8.32గంటలకు బ్రహ్మోత్సవ మండపానికి శ్రీస్వామి అమ్మవార్లు చేరుకున్నారు. ఈ సేవోత్సవంలో సీఎం కేసీఆర్ సతీమణి శోభమ్మ, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డిలు ముందు నడిచారు.
- 8.34 గంటలకు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిలు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు.
- 8.46గంటలకు శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణ వేడుక ప్రారంభమైంది.
- 9.45 గంటలకు శ్రీస్వామి వారికి యజ్ఞోపవీతం చేశారు.
- 10.12గంటలకు శ్రీస్వామి అమ్మవార్లకు పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం జీలకర్ర బెల్లం పెట్టారు.
- 10.16గంటలకు అమ్మవారికి శ్రీస్వామి వారు మాంగళ్యధారణ చేశారు
  10.18గంటలకు శ్రీస్వామి అమ్మవార్లకు ఆచార్యులు ముత్యాల తలంబ్రాలు పోశారు.
- 10.26 గంటలకు భద్రాచలం నుంచి తీసుకువచ్చిన తలంబ్రాలను ఆచార్యులు శ్రీస్వామి అమ్మవారికి సమర్పించారు.
- 10.27 గంటలకు సీఎం సతీమణి శోభమ్మకు, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితాలక్ష్మారెడ్డి, ఐఏఎస్ అధికారులు అనితారాంచంద్రన్, సందీప్ సుల్తానియా, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతిలకు ఆచార్యులు ఆశీర్వచనం చేశారు.
- 10.30గంటలకు శ్రీస్వామి కల్యాణం ముగింపు.
- 10.40గంటలకు శ్రీస్వామి అమ్మవార్ల సేవను ఉత్తర రాజగోపురం నుంచి పడమటి రాజగోపురంలో నుంచి ప్రథమ ప్రాకార మండపంలోకి తీసుకెళ్లారు



యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి వారి సేవతో బ్రహ్మోత్సవ మండపానికి వస్తున్న మంత్రులు, అధికారులు

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

మిర్యాలగూడ: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోల సైదులు గీత కార్మికుడిగా జీవనం కొనసాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే మంగళవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కెమికల్ కంపెనీ ఆవరణలో సామగ్రి దగ్ధం

బీబీనగర్: మండల కేంద్రంలోని బ్రహ్మణపల్లి రోడ్డులో గల పోరస్ కెమికల్ కంపెనీ సమీపంలో మంగళవారం చెత్తను తగలబెడుతుండగా మంటలు పరిశ్రమ ఆవరణలోకి వ్యాపించి కెమికల్ పౌడర్, ఇతర సామగ్రి తగలబడ్డాయి. గంట పాటు పెద్దఎత్తున పొగలు కమ్ముకోవడంతో పట్టణవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

గుండెపోటుతో రైల్వే ప్రయాణికుడు మృతి

భువనగిరి: గుండె పోటుతో రైల్వే ప్రయాణికుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాలోని పెద్ద జగన్నాథపురం గ్రామానికి చెందిన వట్టిపోల మల్లేష్(65) హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఉన్న తన కుమారుడి ఇంట్లో గత నెల రోజులుగా ఉంటున్నాడు. మంగళవారం తన భార్య, కోడలితో కలిసి లింగపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లే జన్మభూమి రైలులో స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌కు కొద్ది దూరంలో మల్లేష్ వాంతులు చేసుకున్నాడు. రైలులో ఉన్న సిబ్బంది గమనించి నాగిరెడ్డిపల్లి స్టేషన్‌లో రైలును నిలిపి ప్రయాణికుడిని దింపి వెళ్లారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బంది వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది స్టేషన్‌కు వచ్చిన మల్లేష్‌ను పరిశీలించగా అప్పటికే అతను గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు టేకు చెట్లు దగ్ధం

మద్దిరాల: ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని టేకు చెట్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన రామగిరి ఉదయకిరణ్ వ్యవసాయ క్షేత్రంలో 30సంవత్సరాల క్రితం అతడి తండ్రి చంద్రమౌళి 300 టేకు మొక్కలను నాటి పెంచుతున్నాడు. కాగా సోమవారం వీరి భూమి పక్కన రైతు తన చెలకలోని తాటిచెట్టుకు నిప్పుపెట్టగా, ఆ మంటలు కాస్త ఉదయ్‌కిరణ్ భూమిలోని 300 టేకు మొక్కలకు అంటుకొని దగ్ధమయ్యాయి. సుమారు రూ.20లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేసినట్లు బాధిత రైతు తెలిపాడు.


యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో భాగంగా పట్టువస్త్రాలను చూపెడుతున్న ఆచార్యులు


కల్యాణం జరిపిస్తున్న ఆచార్యులు


యజ్ఞోపవీతం చేస్తున్న ఆచార్యులు


స్వామివారి సేవలో పాల్గొన్న సీఎం సతీమణి శోభ


విద్యుత్ కాంతుల వెలుగులో కల్యాణ వేదిక

హనుమంత సేవలో నారసింహుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం నిత్యారాధనలు, శ్రీవైష్ణవ సేవ సమాఖ్య వారిచే ప్రభాత భేరీ, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం 9గంటలకు శ్రీస్వామి వారిని శ్రీరామ అలంకారం గావించి హనుమంత వాహన సేవలో ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. శ్రీస్వామి వారు ధర్మమూర్తియైన శ్రీరామ అలంకారములో హనుమంత వాహనంపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతున్న సమయంలో భక్తులు దర్శించుకొని ఆనందాన్ని పొందారు. ఉదయం జరిగిన వేడుకల్లో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈవో గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో నేడు..

ఉత్సవాల్లో బుధవారం ఉదయం శ్రీస్వామి వారు శ్రీమహా విష్ణు అలంకార గరుఢ వాహన సేవ, రాత్రి 7గంటలకు దివ్య విమాన రథోత్సవం నిర్వహిస్తారు.

పకడ్బందీగా పోలీసు బందోబస్తు

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన తిరు కల్యాణ మహోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 470 మంది పోలీసులు రింగ్‌రోడ్డు, ఘాట్‌రోడ్డు, ఆలయ పరిసరాలు, కల్యాణ వేదిక వద్ద బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం 5గంటల నుంచే కొండపైకి వాహనాలు వెళ్లకుండా నిలిపివేశారు. భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, యాదాద్రి ఆలయ ఈఓ గీతారెడ్డి ఇచ్చిన పాసులు ఉన్న వారినే కొండపైకి అనుమతించారు. వీవీపీలు, మీడియా, కల్యాణోత్సవ టిక్కెట్ ఉన్న భక్తులను గ్యాలరీలకు పంపించారు. సామాన్య భక్తులను ఉచిత ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి తరలించారు. ఉత్తర మాఢ వీధిలో, క్యూకాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై భక్తులను కల్యాణం తిలకించేలా ఏర్పాట్లు చేశారు.


హనుమంత వాహనంపై రామావతారంలో ఊరేగుతున్న నారసింహుడు

ఆకట్టుకున్న ధార్మిక సభలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివాలయం వద్ద నిర్వహిస్తున్న ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు భక్తులను ఆకట్టుకున్నాయి. మంగళవారం ఉదయం శ్రీవైష్ణవ సేవా సమాఖ్య యాదగిరిగుట్టచే ప్రభాత భేరీ, అనంతరం భూదాన్‌పోచంపల్లికి చెందిన శ్రీపాండురంగస్వామి భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీగాయత్రి భజన మండలిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత ఆలయ ఆస్థాన కళాకారులచే మంగళ వాయిద్యాలు, వైదిక ప్రార్థనతో పాటు నృసింహతత్వంపై మైలవరపు శ్రీనివాసారావు ఉపన్యాసం, చెబ్రోలు నారాయణదాసు భాగవతార్‌చే భీష్మ ప్రతిజ్ఞ హరికథా గానం గావించారు. సాయంత్రం లలితా ఫైన్ ఆర్ట్స్ వారిచే కూచిపూడి నృత్యం, కుమారి జయప్రదా రామమూర్తిచే వేణుగాన కచేరి నిర్వహించారు.

ఉచితంగా వైద్య సేవలు..

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు వంశీకృష్ణ, డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో కొండపైన బస్టాండ్ వద్ద, కొండ కింద కల్యాణ కట్ట వద్ద ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఫిర్జాదిగూడలో గల శ్రీకర ఆస్పత్రి, సాయిసంజీవిని ఆస్పత్రుల ఆధ్వర్యంలో కూడా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. హైదరాబాద్‌లోని రెమిడిస్ ఆస్పత్రి, ప్రగతి రిసార్ట్స్ ఎమిడోస్ వారు భక్తుల దాహార్తిని తీర్చేందుకు తాగు నీరు పంపిణీ చేశారు.

టీటీడీ తరఫున పట్టువస్త్రాలు అందజేత

యాదగిరిగుట్ట: యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన తిరు కల్యాణ మహోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తరఫున డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చి ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో యాదాద్రి ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తిలకు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు మాట్లాడుతూ.. యాదాద్రీశుడి కల్యాణోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు అందించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. పలు కారణాల చేత టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఈఓ ఇక్కడకు రాలేకపోయారని, వారి ఆదేశాలతో తాను పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించానని పేర్కొన్నారు.


యాదాద్రి ఆలయ ఈఓకు పట్టువస్త్రాలు అందజేస్తున్న టీటీడీ ఆలయ అధికారులు


క్షేత్రానికి వచ్చిన భక్తుడిని ఎత్తుకొని దర్శనానికి తీసుకెళ్తున్న పోలీస్ సిబ్బంది


కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణులు

ఫాస్టాగ్‌తో పట్టుబడ్డారు !

- నలుగురిలో ఇద్దరు అరెస్టు, రిమాండ్
- ఆధునిక టెక్నాలజీతో ఏటీఎంలు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా
- ఈ నెల 10న రాజాపూర్ ఏటీఎంలో చోరీ
- వివరాలు వెల్లడించిన మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ


సీజ్ చేసిన కారు

మహబూబ్‌నగర్ క్రైం: వాహనం ఫాస్ట్‌ట్యాగ్ ఆధారంగా అంతర్రాష్ట్ర ఏటీఎం దొంగల ముఠాను మహబూబ్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబ్‌నగర్ ఎస్పీ కె. నరసింహ వెల్లడించారు. ఈ నెల 10న మధ్యాహ్నం రాజాపూర్‌లో ఉన్న టాటా ఇండికాష్ ఏటీఎంలో దొంగతనం జరిగింది. దీనిపై ఈనెల 16న బ్యాంకు సిబ్బంది ఈడిగ రాఘవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి విచారణ చేసినట్లు వెల్లడించారు. పంజాబ్‌కు చెందిన భూపేందర్‌సింగ్ బీసీఏ పూర్తి చేసి ఏటీఎంలలో నగదు అప్‌లోడ్ చేయడంతో పాటు ఏటీఎం మిషన్లు మరమ్మతు చేస్తూ జీవనం సాగించేవాడు. దాదాపు 14నుంచి 15ఏళ్ల పాటు ఏటీఎం టెక్నీషియన్‌గా పని చేస్తున్న క్రమంలో వాటిద్వారా ఆదాయం తక్కువగా రావడంతో ఏటీఎంలలో సాఫ్ట్‌వేర్ ఉపయోగించి దొంగతనాలు చేయాలని పథకం వేసుకున్నాడు. దీనికి పంజాబ్‌కు చెందిన గుర్‌గగన్ సింగ్, రష్‌పాల్, సందీప్‌సింగ్‌లను కలుపుకుని చోరీ చేయడం మొదలుపెట్టాడు. అయితే ఈ ముఠా సభ్యులు ఓటీపీ వచ్చే విధానం కలిగిన నూతన టెక్నాలజీ ఏటీఎంలు కాకుండా మాన్యువల్‌గా ఉపయోగించే ఏటీఎంలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేసేవారు. వారు ఎంపిక చేసుకున్న ఏటీఎంలలో ప్రైవేట్ ఏజెన్సీ వచ్చి ఏటీఎంలో డబ్బులు పెడుతున్న క్రమంలో అప్పటికే ఈ ముఠా ఏటీఎంలో వైఫై కెమెరా ఏర్పాటు చేసి వాటి ద్వారా నగదు పెట్టే సమయంలో క్యాష్ బాక్స్ పాస్‌వర్డ్ తెలుసుకుంటారు. ఆ తర్వాత అతని మొబైల్‌కు వచ్చే పాస్‌వర్డ్ వీడియో ఉపయోగించి ఏటీఎంను ఏమాత్రం ధ్వంసం చేయకుండా కేవలం పాస్‌వర్డ్‌తో ఓపెన్ చేసి డబ్బులు ఎత్తుకెళ్లడం ఈ ముఠా ప్రత్యేకత. ఈ క్రమంలోనే ఈనెల 10న మధ్యాహ్నం రాజాపూర్‌లో ఉన్న టాటాఇండికాష్ ఏటీఎంలో ప్రైవేట్ ఏజెన్సీ డబ్బులు పెట్టి వెళ్లిన పది నిమిషాల వ్యవధిలో పాస్‌వర్డ్ ఉపయోగించి రూ.7,82,300నగదు చోరీ చేసి మళ్లీ బాక్సులను పాస్‌వర్డ్ ద్వారా మూసివేశారు. అక్కడి నుంచి డబ్బులు తీసుకుని డీఎల్ 1సీఏఎఫ్ 7975 ఫార్చ్యునర్ కారులో పరారయ్యారు. ఆ తర్వాత కారు కోసం ఉపయోగించిన ఫాస్టాగ్ ద్వారా నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. ఇదే ముఠా సంగారెడ్డిలో ఏటీఎం నుంచి రూ.30 లక్షలు, నల్లగొండ జిల్లాలోని చిట్యాల దగ్గర ఉన్న ఏటీఎం నుంచి రూ.3.4 లక్షలు నగదు ఎత్తుకెళ్లారని తెలిపారు. దీంతో పాటు పంజాబ్, రాజస్థాన్, చండీగర్, ఉత్తరాఖండ్‌లో ఏటీఎం దొంగతనాలు చేశారని, 2012లో జైలుకు వెళ్లినట్లు వెల్లడించారు. ఈ ముఠాలో ఏ1 గుర్ గగన్‌సింగ్, ఏ2 భూపేందర్ సింగ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, దీంట్లో ఏ3 రష్‌పాల్, ఏ4సందీప్ సింగ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.5వేల నగదు, కారు, రెండు సెల్‌ఫోన్స్ రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ టి.మహేష్, సీఐలు జమ్ములప్ప, ఇఫ్తాకార్ అహ్మద్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం



క్రాంతికుమార్ (ఫైల్)

గుర్రంపోడు: మండలంలోని నల్గొండ–దేవరకొండ ప్రధాన రహదారిపై గుడిపల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లికి చెందిన పాదిలి క్రాంతికుమార్(26) నల్లగొండలోని డీవీఎం కాలేజీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం బైక్‌పై నల్లగొండకు వెళ్తుండగా మార్గమధ్యలో గుడిపల్లి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్రాంతికుమార్ తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి పాదిలి సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తిప్పర్తిలో రైల్వే ఉద్యోగి..

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతిచెందిన ఘటన తిప్పర్తి మండల కేంద్రం శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని పద్మశాలీనగర్‌కు చెందిన గాజుల రాజు(27) తిప్పర్తి రైల్వే స్టేషన్‌లో పాయింట్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి రాజు బైక్‌పై డ్యూటీకి వెళ్తుండగా తిప్పర్తి మండల కేంద్రం శివారులోని చర్చి సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ యూటర్న్ తీసుకుంటుండగా బైక్‌తో ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజును స్థానికులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గాజుల శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఎస్‌ఐ వాస ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని మహిళ..


ఘటనా స్థలిలో సంధ్యారాణి మృతదేహం

బీబీనగర్: మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌కు చెందిన విశ్వరూప సంధ్యారాణి(38) మంగళవారం సాయంత్రం రామంతాపూర్‌లోని గాంధీనగర్ కాలనీకి చెందిన తన్నాది సంతోష్‌తో కలిసి బైక్‌పై భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా గూడూరు టోల్‌ప్లాజా దాటగానే వెనుక నుంచి వస్తున్న లారీ అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంధ్యారాణి అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడ్డ సంతోష్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సంధ్యారాణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: గడ్డిపాల ఆకు రసం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాలు.. మండలంలోని తొండల్‌వాయి గ్రామానికి చెందిన బండారు స్వామి(30) గ్రామంలో భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం రాత్రి వ్యవసాయ పొలానికి వెళ్లిన స్వామి గడ్డిపాల ఆకు రసం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లి స్వామిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. కాగా మల్లేష్ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

సైబర్ నేరగాళ్ల టోకరా

మోత్కూరు: సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బులను స్వాహా చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తూ హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు వారి బారిన పడి లక్షల రూపాయలు పోగొట్టుకుంటూ లబోదిబోమంటున్నారు. ఇలాంటి సంఘటనే మోత్కూరు మండలంలో చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన వ్యక్తి ఎవరికీ తన ఓటీపీ షేర్ చేయలేదు, ఏ లింకులను ఓపెన్ చేయలేదు. కానీ సైబర్ నేరగాళ్లు అతని ఖాతా నుంచి సుమారు రూ.20 లక్షలు స్వాహా చేసినట్లు సమాచారం. బాధితుడు బొంబాయిలో కష్టపడిన సంపాదనతో గతంలో భూమి కొనుగోలు చేశాడు. కొద్ది రోజుల క్రితం ఆ భూమిని విక్రయించగా వచ్చిన డబ్బును తన బ్యాంకు ఖాతాలో భద్రపరచుకున్నాడు. అతడు పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు టోల్‌గేట్ సమీపంలో ఫాస్టాగ్ చేయడం కోసం తన ఫోన్ అక్కడ గుర్తు తెలియని వారికి ఇచ్చాడని తెలిసింది. దీంతో విడతల వారీగా మోత్కూరు ఎస్‌బీఐలో ఉన్న అతని ఖాతాకు లింక్ అయిన ఫోన్ నంబర్‌కు మెసేజ్‌లు వెళ్లకుండా బ్లాక్ చేసిన సైబర్ నేరగాళ్లు నెల రోజుల వ్యవధిలో సుమారు రూ.20 లక్షలు ఖాళీ చేశారు. అనుమానం వచ్చిన బాధితుడు మోత్కూరు ఎస్‌బీఐని సంప్రదించి వివరాలు సేకరించి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. సదరు బాధితుడు తన పేరు చెప్పడానికి నిరాకరించాడు.

మాదిగల సంగ్రామ పాదయాత్ర ప్రారంభం


పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడఅర్బన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు చేపట్టిన మాదిగల సంగ్రామ మహాపాదయాత్ర మంగళవారం రాత్రి కోదాడలో ప్రారంభమయ్యింది. ఈ పాదయాత్ర మార్చి 15 నాటికి హైదరాబాద్ శివారుకు చేరుకుంటుందని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు బొజ్జ సైదులు, ఏపూరి రాజు, బోడ సునీల్, మామిడి కరుణాకర్, ఇరిగి శ్రీశైలం తెలిపారు. ఎంఎస్‌పీ రాష్ట్ర సమన్వయకర్త జానకిరామయ్య చౌదరి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్నమాదిగ, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి యాతాకుల రాజన్నమాదిగ జెండా ఊపి ఈ పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాట ఇచ్చి తొమ్మిదేళ్ల గడుస్తున్నా ఎలాంటి ప్రకటన చేయకుండా మాదిగ, మాదిగ ఉపకులాలను మోసం చేస్తుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పట్ల కేంద్రం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా చేపట్టిన ఈ పాదయాత్ర మార్చి 15న రాష్ట్ర రాజధానికి హైదరాబాద్‌ను చేరుకుంటుందని, అక్కడ రహదారులు దిగ్బంధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు శంకర్, ఏడుకొండలు, ఆంజనేయులు, రాము, కోటేశ్, శ్రీను, బాలచంద్రుడు, రవి, స్వామి, ప్రసాద్, శ్రీనివాస్, విజయరావు, శ్రీనివాస్, అంజయ్య, సాంబయ్య, సూరి, అభిమన్యు, సత్యరాజు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్లయిన శ్రీ రేపాల అంతయ్య తండ్రి శేషయ్య మరియు శ్రీ చీదళ్ళ చంద్రశేఖర్ తండ్రి వెంకటరామయ్య, ఇరువురి నివాసం మిర్యాలగూడ పట్టణం, నల్లగొండ జిల్లా గార్ల సూచనల మేరకు ఈ ప్రకటన జారీ చేయనైనది. నా క్లయింట్లు ఈ దిగువ షెడ్యూల్లో చూపిన ఆస్తిని (1) N.V.R. కాటన్ జిన్నింగ్ మిల్స్, రుద్రవరం @ రుద్రారం, మిర్యాలగూడ మండలం, నల్లగొండ జిల్లా, అను భాగస్వామ్య సంస్థ తరఫున మేనేజింగ్ పార్టనర్, శ్రీ కందుల శ్యాంసుందర్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి, నివాసం దామరచర్ల గ్రామం & మండలం, నల్లగొండ జిల్లా (2) గురులక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్స్, రుద్రవరం @ రుద్రారం, మిర్యాలగూడ మండలం, నల్లగొండ జిల్లా, అను భాగస్వామ్య సంస్థ తరఫున మేనేజింగ్ పార్టనర్, శ్రీ కటికం సైదులు రెడ్డి తండ్రి మల్లారెడ్డి, నివాసం వీర్లపాలెం గ్రామం, దామరచర్ల మండలం, నల్లగొండ జిల్లా గార్ల నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని కొనుగోలు ధనంలో కొంత మొత్తాన్ని బయాన పూర్వకంగా చెల్లించి విక్రయ అగ్రిమెంట్ గావించుకున్నారు.

సదరు షెడ్యూల్ ఆస్తిలో, N.V.R. కాటన్ జిన్నింగ్ మిల్స్ అను భాగస్వామ్య సంస్థ ఎ. 02-24 గుంటల భూమిని, సదరు భాగస్వామ్య సంస్థ శ్రీ నాదెండ్ల లక్ష్మీనారాయణ తండ్రి చిన వెంకటేశ్వర్లు, నివాసం గుంటూరు పట్టణం మరి నల్గురు భాగస్వాముల (పార్టనర్స్)తో కలిసి సంస్థను స్థాపించి, అట్టి సంస్థ పేరున రిజిష్టర్ కొనుగోలు దస్తావేజు నెం. 2202/2015 అను దాని ద్వారా కొనుగోలు చేసి అందులో జిన్నింగ్ మిల్ ఏర్పాటు కోసం, రుద్రారం గ్రామ పంచాయతి నుండి అనుమతి పొంది, భవన నిర్మాణాలు గావించగా, సదరు గ్రామ పంచాయతి వారు అట్టి భవనానికి డోర్ నెం. 4-29/1, ఏర్పాటు చేసినారు. అదే విధంగా షెడ్యూల్ ఆస్తిలో, గురులక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్స్ అను భాగస్వామ్య సంస్థ ఎ. 02-12 గుంటల భూమిని సదరు భాగస్వామ్య సంస్థ శ్రీ నాదెండ్ల గురువేశ్వర్ రావు తండ్రి చిన వెంకటేశ్వర్లు, నివాసం గుంటూరు పట్టణం మరి ఇద్దరు భాగస్వాముల (పార్టనర్స్) తో కలిసి సంస్థను స్థాపించి, అట్టి సంస్థ పేరున రిజిష్ట్రీ కొనుగోలు దస్తావేజు నెం. 2200/2015 అను దాని ద్వారా కొనుగోలు చేసి అందులో జిన్నింగ్ మిల్ ఏర్పాటు కోసం, రుద్రారం గ్రామ పంచాయతి నుండి అనుమతి పొంది, భవన నిర్మాణాలు గావించగా, సదరు గ్రామ పంచాయతి వారు అట్టి భవనానికి డోర్ నెం. 4-29 ఏర్పాటు చేసినారు. అంతేకాకుండా సదరు రెండు భాగస్వామ్య సంస్థలు ఉమ్మడిగా షెడ్యూల్ ఆస్తిలో ఎ. 0-20 గుంటల భూమిని రిజిష్ట్రీ కొనుగోలు దస్తావేజు నెం. 2201/ 2015 అనుదాని ద్వారా కొనుగోలు చేసి ఉమ్మడిగా రెండు భాగస్వామ్య సంస్థల అవసరార్థం ఖాళీ స్థలంగా ఉమ్మడి హక్కులతో అనుభవిస్తున్నారు. ఇట్టి మూడు విస్తీర్ణాల భూములు, అందులోని రెండు సంస్థల కట్టుబడులు ప్రక్క ప్రక్కనే యుండి ఏక ఖండంగా ఏర్పడినవి. సదరు మూడు విస్తీర్ణాలను, సదరు రెండు భాగస్వామ్య సంస్థలు పైన తెలియజేసిన రిజిష్ట్రీ కొనుగోలు దస్తావేజుల ద్వారా శ్రీమతి బండి సౌమ్య భర్త యాదగిరి రెడ్డి, నివాసం ఈదులగూడెం, మిర్యాలగూడ పట్టణం గారి నుండి కొనుగోలు చేయగా సంక్రమించినదని, మరియు సదరు బండి సౌమ్య గారికి నూనె సాయి ప్రసాద్ తండ్రి అమ్మిరాజు మరియు నూనె పద్మజ భర్త సుబ్బారావు నివాసం మిర్యాలగూడ అనువారల నుండి రిజిష్ట్రీ కొనుగోలు దస్తావేజు నెం. 3093/2010 అను దాని ద్వారా సంక్రమించినదని, మరియు వారి అమ్మకందారులైన నూనె సాయి ప్రసాద్ & నూనె పద్మజ గార్లకు మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామ కాపురస్తులైన జొన్నలగడ్డ రంగారెడ్డి తండ్రి కోటి రెడ్డి మరియు జొన్నలగడ్డ వనజాత భర్త రంగా రెడ్డి గార్ల నుండి రిజిష్ట్రీ కొనుగోలు దస్తావేజు నెం. 2675/2008 & 2676/2008 అను వాని ద్వారా సంక్రమించినదని, నా క్లయింట్లకు తెలియజేసి అమ్ముచున్నారు. అంతే కాకుండా, సదరు రెండు భాగస్వామ్య సంస్థలలోని భాగస్వాముల చేరిక మరియు నిష్క్రమణ (రిటైర్మెంట్) ఎప్పటికప్పుడు చట్టబద్ధంగా జరిగి ఈ రోజు నాటికి ఉన్న సదరు రెండు భాగస్వామ్య సంస్థలలోని అందరు భాగస్వాముల ఏకగ్రీవ నిర్ణయం ప్రకారం షెడ్యూల్ ఆస్తిని అమ్ముచున్నట్లుగా సదరు రెండు భాగస్వామ్య సంస్థల మేనేజింగ్ పార్టనర్లు నా క్లైంట్లకు తెలియజేసి అమ్ముచున్నారు.

కావున, ఇట్టి కొనుగోలు వ్యవహారంలో ఎవరికైనను, ఏ విధమైన అభ్యంతరాలున్నను, ఈ ప్రకటన వెలువబడిన నాటి నుండి వారం రోజులలోపుగా సరైన సాక్షాధారాలతో తెలియజేయవలసినదిగా కోరనైనది. గడువు తదుపరి వచ్చే అభ్యంతరాలు పరిగణలోకి తీసుకొనబడవు. గడువు లోపు ఏలాంటి అభ్యంతరాలు రాని యెడల, నా క్లయింట్లు సదరు కొనుగోలు వ్యవహారంలో ముందుకు సాగిపోవుదురు.

షెడ్యూల్ ఆస్తి : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం రుద్రవరం @ రుద్రారం రెవిన్యూ గ్రామ శివారులో, గతంలో రుద్రారం గ్రామ పంచాయతి పరిధిలో చేరియున్నదై, ప్రస్తుతం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలో చేరియుండి డోర్ నెం. 4-29/1 & 4-29 కలిగి సర్వే నెంబర్ 460/అ1 లో ఎ. 0-39 గుంటలు, సర్వే నెంబర్ 461/ఈ లో ఎ. 01-25 గుంటలు మొత్తం ఎ. 02-24 గుంటలు N.V.R. కాటన్ జిన్నింగ్ మిల్లుకు సంబంధించినవై, సర్వే నెంబర్ 461/ఈ లో ఎ. 0-39 గుంటలు, సర్వే నెంబర్ 461/ఈ1లో ఎ. 01-13 గుంటలు మొత్తం ఎ. 02-12 గుంటలు గురులక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్లుకు సంబంధించినవై, సర్వే నెంబర్ 460/అ1 లో ఎ. 0-17 గుంటలు, సర్వే నెం. 461/ఈ1 లో ఎ. 0-03 గుంటలు మొత్తం ఎ. 0-20 గుంటలు N.V.R. & గురులక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్లులకు ఉమ్మడిగా సంబంధించినవై, ఈ విధంగా మొత్తం ఎ. 05-16 గుంటల విస్తీర్ణం కలిగి ఈ క్రింది హద్దుల మధ్యన కలదు.

ఉత్తరం : వడ్డెర పెద్దయ్య గారి భూమి, దక్షిణం : NSP కాలువ మరియు కాలువ రోడ్డు, తూర్పు : గతంలో బండి సౌమ్య గారి భూమి, ప్రస్తుతం కటికం శంకర్ రెడ్డి, సైదులు రెడ్డి మరియు వనకూరి వెంకట్ రెడ్డి గార్ల భూమి, పడమర : గతంలో మైనంపాటి వెంకట్ రెడ్డి గారి భూమి, ప్రస్తుతం వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ మరియు వంగాల సుధా రాణి గారి భూమి

స్థలం : మిర్యాలగూడ.
తేది. 27-02-2023

ఇట్లు : పి. రవీంద్రారెడ్డి, అడ్వకేట్,
MIG-11, హౌజింగ్ బోర్డు, మిర్యాలగూడ.
సెల్ : 90006 55365